సాక్షి బాపట్ల

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: బోటుమెరక గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా దేవస్థానం వార్షికోత్సవం

యడ్లపాడు: బోయపాలెంలో వేంచేసి ఉన్న గ్రామదేవత పోలేరమ్మ పోతురాజు స్వామివార్ల దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది.



వైభవం.. పడిపూజ మహోత్సవం

దాచేపల్లి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నారాయణపురం బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కోన



బాపట్ల : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతికి అవకాశం దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా 33 మందిని పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో అవకాశం కల్పించగా బాపట్ల జిల్లా నుంచి కోన రఘుపతికి అవకాశం లభించింది. ఈమేరకు కోన రఘుపతికి పలువురు అభినందనలు తెలిపారు.

శింగరకొండపై శంఖు చక్రనామాలు ఏర్పాటు



అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండపైనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ఆవరణలో నూతనంగా శంఖు, చక్ర, నామాలు, ఆంజనేయస్వామి విగ్రహాలను సిమెంట్‌తోఏర్పాటుచేశారు. వీటిని పట్టణానికి చెందిన నాగసూరి రామారావు తన సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. శనివారం ఆ విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలతోపాటు, సుదర్శన యాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది దాతలు పాల్గొన్నారు.

నృసింహుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



మంగళగిరిటౌన్ : మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా స్వామిని దర్శించేందుకు క్యూలో బారులుదీరారు. నృసింహుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. తొలుత ఆలయ ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

బాపట్ల విద్యార్థుల హవా

- సీనియర్ ఇంటర్‌లో 79 శాతం ఉత్తీర్ణత
- జూనియర్ ఇంటర్‌లో 65 శాతం ఉత్తీర్ణత
- సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 975 మార్కులతో ప్రథమస్థానం
- సీనియర్ ఇంటర్ బైపీసీలో 975 మార్కులతో ప్రథమస్థానం



పరీక్షలు రాసేందుకు హాజరవుతున్న విద్యార్థులు (ఫైల్)



షేక్ సమీరా(975)



కె.దాత్రిశ్రీ(975)

బాపట్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో బాపట్ల జిల్లా విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జిల్లాలో మొదటి సంవత్సరంలో మొత్తం 9146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 5907 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తీర్ణతలో జిల్లా 65 శాతం సాధించింది. సీనియర్ ఇంటర్‌లో జిల్లాలో మొత్తం 7420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 5837 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతలో జిల్లా 79 శాతం సాధించింది.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు

జిల్లాలో మొత్తం 17 ప్రభుత్వ కళాశాలలు ఉండగా ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో బాపట్ల డెఫ్ అండ్ డెమ్ జూనియర్ కళాశాల, నూతలపాడు జూనియర్ కళాశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాయి. 73.33 శాతం సాధించి బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది.

- సీనియర్ ఇంటర్‌లో బాపట్ల డెఫ్ అండ్ డెమ్ జూనియర్ కళాశాల, బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచాయి. చందోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల 79.71 శాతం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది.

బాలికలదేపై చేయి


ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసించే వారిలో విద్యార్థినులే పైచేయి సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పర్చూరుకు చెందిన షేక్ సమీరా 1000 మార్కులకుగానూ 975 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది.

- బైపీసీలో చీరాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన కె.ధాత్రిశ్రీ 1000 మార్కులకుగానూ 975 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది.

ఉరుసులో ఘర్షణ..

ఇద్దరు యువకులపై 30 మంది దాడి

మార్టూరు: మార్టూరులో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘర్షణలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పాతకక్షల నేపథ్యంలో వలపర్లకు చెందిన ఇద్దరు యువకులపై మార్టూరుకు చెందిన సుమారు 30 మంది యువకులు వేకువజామున నాలుగు గంటల సమయంలో దాడి చేశారు. బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి. వలపర్లకు చెందిన కాగత్ ముని అనిల్ అతని స్నేహితుడు షేక్ గాలిషాలు శుక్రవారం రాత్రి మార్టూరులో జరిగిన ఉరుసుకు హాజరయ్యారు. మార్టూరుకు చెందిన సుభాని గత కొన్ని సంవత్సరాలుగా వలపర్ల గ్రామంలో కుటుంబంతో స్థిరపడ్డాడు. సుభాని కుమారుడు షాజహాన్ గత నెలలో ఇంకొల్లు మండలం నక్కలపాలెం గ్రామం నుంచి ఓ బైకును దొంగిలించి వలపర్లకు తీసుకురాగా స్థానికుల సమాచారంతో మార్టూరు పోలీసులు ఆ బైకును స్వాధీనం చేసుకొని ఇంకొల్లు పోలీసులకు అప్పగించారు. బైకు చోరీ విషయాన్ని అనిల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడనే అనుమానంతో షాజహాన్ అతను తండ్రి సుభాని కక్ష పెంచుకొని అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మార్టూరు ఉరుసుకు వచ్చిన అనిల్ అతని స్నేహితుడు గాలీషాలపై సుభాని కొంతమంది యువకులతో కలిసి శనివారం తెల్లవారుజామున దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. దాడిలో గాయపడిన అనిల్, గాలీషాలను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం బాధితులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బేఖాతర్

ఉన్నతాధికారుల ఆదేశాలు

- ఈర్ల గంగమ్మ తిరునాళ్లలో ఎస్ఐ ఏకపక్షం
- పచ్చపార్టీ ప్రభలకే అనుమతి
- వైఎస్సార్ సీపీ వర్గీయులకు నో పర్మిషన్
- పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోని ఎస్ఐ
- ఎస్ఐ తీరుతో ఉన్నతాధికారులకు తలవంపులు
- పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా ఎస్ఐ వైఖరి
- మంత్రి అనుచరులు చెప్పిందే అమలు చేస్తున్న ఎస్ఐ
- బల్లికురవలో భయభ్రాంతులు నెలకొల్పడానికే ఎస్ఐ నాగరాజు నియామకమన్న ప్రచారం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పోలీసు అంటే క్రమశిక్షణ, ఉన్నతాధికారుల పట్ల భయభక్తులతో ఉండడం, వారిని గౌరవించడం, వారి ఆదేశాలను తు.చ పాటించడం. ప్రజల పట్ల ప్రేమతో ఉండడం, వారి సమస్యల పట్ల స్పందించడం, బాధితుల పక్షాన నిలవడం, వారికి న్యాయం అందించడం. కానీ ఆ పోలీసు అధికారి అందుకు భిన్నం. వృత్తి, చట్టం పట్ల ఆయనకు గౌరవం లేదు. ఆయనకు పైఅధికారుల పట్ల భయభక్తులు కానరావు. పోనీ ప్రజల పట్ల ప్రేమ ఉందా అంటే అదీలేదు. ప్రజలను పార్టీలుగా విభజించి చూడడమే ఆయనకు తెలిసింది. అందులో పచ్చపార్టీ మద్దతుదారులు మాత్రమే ప్రజల కింద లెక్క. మిగిలిన వర్గాల వారంటే బుసకొట్టే కోపం. వారిని ఎన్ని ఇబ్బందులు పెట్టేందుకైనా ఆయన సిద్ధం. పోలీసుస్టేషన్‌ను తన సొంత జాగీరుగా చూసేతత్వం. సొంత శాఖ ఉన్నతాధికారులు కాకుండా పచ్చపార్టీ నేతలు చెప్పిందే ఆయనకు వేదం. ఇటీవల బల్లికురవ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు వ్యవహారం ఇప్పుడు జిల్లా పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



హడావుడిగా బల్లికురవకు బదిలీ

ప్రకాశం జిల్లా ముండ్లమూరులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుచరులు హుటాహుటిన బాపట్ల జిల్లాలోని మంత్రి సొంత నియోజకవర్గం పరిధిలోని బల్లికురవ మండలం ఎస్ఐగా నియమించారు. అంతవరకూ అయితే ఇది చర్చనీయాంశంకాదు. ఎస్ఐ నాగరాజు విధుల్లో చేరగానే వైఎస్సార్ సీపీ వారిని లక్ష్యంగా చేసుకున్నారు. మండలంలో జరిగే ఈర్ల గంగమ్మ తిరునాళ్లను ఇందుకు వేదిక చేసుకున్నారు. ఈ ప్రాంత ప్రజలు పెద్దఎత్తున ప్రభలు ఏర్పాటు చేస్తారు. గతంలో ఉన్న పోలీసు అధికారులు ఇరు పార్టీల వారికి అనుమతులు ఇచ్చి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కాపాడుకుంటూ రాగా ఎస్ఐ నాగరాజు మాత్రం దాన్ని మంటగలిపి గ్రామాల్లో తిరిగి ఫ్యాక్షన్ రగిలించేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభలకు అనుమతి ఇచ్చిన అధికారులు

వాస్తవానికి గత సోమవారానికి ముందువరకూ బల్లికురవ ఎస్ఐగా ఉన్న జీవీ అంజనేయులు, ఇప్పటికీ సంతమాగులూరు సీఐగా కొనసాగుతున్న వెంకట్రావులకు వైఎస్సార్ సీపీ మద్దతు దారులు ప్రభల ఏర్పాటు కోసం అనుమతి కోరగా అందుకు ఎస్ఐ, సీఐలు అనుమతి తెలిపి ఈ విషయం బాపట్ల డీఎస్పీకి నివేదించగా ఆయన సైతం ఓకే చెప్పారు. కొత్తగా వచ్చిన ఎస్ఐ నాగరాజు మాత్రం అనుమతులను నిరాకరించి పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలను ఖాతరు చేయకపోవడం ఇప్పుడు పోలీసు వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. పైగా డీఎస్పీ, సీఐలు వైఎస్సార్‌సీపీ నాయకుల పట్ల సానుకూలంగా ఉన్నారని మంత్రి ముఖ్య అనుచరులకు ఎస్ఐ ఫిర్యాదు చేయగా మంత్రి అనుచరులు సీఐ, డీఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఎస్ఐ వ్యవహారంపై అటు పోలీసు ఉన్నతాధికారులు సైతం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ తీరుపై ఎస్పీ తుషార్‌డూడీ మరింత ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న బల్లికురవ ప్రాంతంలో ఇలాంటి ఎస్ఐ వుంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశముందని కిందిస్థాయి పోలీసు అధికారులు కొందరు ఎస్పీ దృష్టికి తెచ్చినట్లు సమాచారం.

'రాజీ'కి అంగీకరించని ఎస్ఐ చౌదరి

2017లో జరిగిన వేమవరం జంట హత్యల కేసు రాజీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న మంత్రి అనుచరులు కఠినంగా వ్యవహరించి సంబంధీకులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేయాలని మొన్నటి వరకూ బల్లికురవ ఎస్సైగా ఉన్న జీవీ చౌదరిపై పలుమార్లు ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. చట్టాన్ని కొంత గౌరవించే వ్యక్తిగా మంత్రి అనుచరుల ఆదేశాలను ఎస్ఐ జీవీ చౌదరి అంగీకరించకపోవడంతో ఆయనను పది నెలల కాలపరిమితి ముగియకుండానే మంత్రి అనుచరులు బదిలీచేయించి నాగరాజును ఎస్ఐగా నియమించుకున్నట్లు సమాచారం. వేమవరం హత్య కేసు రాజీకోసమే నాగరాజును హుటాహుటిన బల్లికురవకు పిలిపించినట్లు జోరుగా ప్రచారంవుంది.

పచ్చపార్టీ కార్యకర్తగా పేరు

తాను పచ్చపార్టీ కార్యకర్తనని బహిరంగంగా చెప్పుకుంటారని నాగరాజుకు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పేరుంది. ఆ పేరును సార్థకత చేసుకునేందుకు నాగరాజు ఖాకీని, లాఠీని అడ్డుపెట్టారు. ఈ దఫా తిరునాళ్లకు వైఎస్సార్ సీపీ మద్దతు దారులకు అనుమతి ఇవ్వనని, అసలు ఆ పార్టీ వర్గీయులు పోలీసుస్టేషన్ ఆవరణలోకి వచ్చినా సహించనని అల్టిమేటం ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించినా ఎస్ఐ మండిపడ్డారు. కేవలం పచ్చపార్టీ వారికి మాత్రమే ఐదు ప్రభలకు అనుమతి ఇచ్చి తన నైజం చాటారు.


ఎస్ఐ తీరుపై ఎస్పీ ఆగ్రహం

క్రమశిక్షణ కలిగిన పోలీసు శాఖలో ఎస్ఐగా ఉన్న వ్యక్తి సీఐ, డీఎస్పీ, జిల్లా ఎస్పీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజకీయాలకతీతంగా జరుగుతున్న తిరునాళ్లలో ఒక వర్గానికే అనుమతులివ్వడం పోలీసులను ప్రజలలో మరింతగా పలుచన చేస్తుందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఎస్ఐ తీరుపై శనివారం ఎస్పీ ఆరా తీసినట్లు సమాచారం. జిల్లాలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తారని ఎస్పీ దూడీకి పేరుంది. అలాంటిది బల్లికురవ లాంటి ఫ్యాక్షన్ ప్రాంతంలో ఒక వర్గానికి కొమ్ముకాసి ఉన్నతాధికారులను సైతం లెక్కచేయక శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం ఎవరు చేసినా సహించేది లేదని ఎస్పీ అన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎస్ఐ నాగరాజు దూకుడుకు అడ్డుకట్ట వేస్తారా? లేదా అనేది వేచి చూడాల్సిందే!

విజయకీలాద్రిపై శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు సకల విద్యాప్రాప్తికై హయగ్రీవ హోమం, అర్చన, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.





అజరామర జ్ఞాపకం

నాయనమ్మ



కీ॥శే॥ మోదుగుల సుబ్బమ్మ గారి
అనురక్తితో

భార్య



కీ॥శే॥ మోదుగుల ఆదిలక్ష్మి గారి
సహచర్యంలో

అమ్మ - నాన్న



కీ॥శే॥ మోదుగుల రామిరెడ్డి - కోటమ్మ గార్ల
ఆశీస్సులతో

అక్క - చెల్లెలు




వట్రాల రత్తమ్మ - అంగిరెడ్డి తిరుపతమ్మ గార్ల
అనురాగంతో

అత్త - మామ



కీ॥శే॥ దేవగిరి వెంకటసుబ్బారెడ్డి - కోటమ్మ గార్ల
అభిమానంతో



జననం
09-10-1937

మరణం
06-04-2025

కీ॥శే॥ మోదుగుల పాపిరెడ్డి గారు MA, LLB

ప్రముఖ సోషలిస్టు నాయకులు, న్యాయవాది

" బృహత్తర బాధ్యతతో భూమ్మీద కన్ను విప్పారు
మహత్తర శక్తితో కర్తవ్యం నెరవేర్చి కన్నుమూశారు
మీ జీవితం అపురూపం. మీ జ్ఞాపకం అజరామరం "

ఇట్లు :

మోదుగుల వాసుదేవరెడ్డి, కుమారుడు
మోదుగుల ఉదయకుమారి, కోడలు

మనుమలు - మనుమరాలు
వలసారెడ్డి యజ్ఞేశ్ రెడ్డి - అఖిలాండేశ్వరి
మోదుగుల కార్తిక్ రెడ్డి

మోదుగుల వేణుగోపాలరెడ్డి, కుమారుడు
మోదుగుల మాధవీ కృష్ణ, కోడలు

మనుమలు
మోదుగుల సాకేత్ రామిరెడ్డి
మోదుగుల ప్రణవ సుబ్బారెడ్డి

ఆళ్ల దాక్షాయణి, కుమార్తె
ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, అల్లుడు

మనుమలు - మనుమరాలు
ఆళ్ల శరణ్ - శ్రావ్య
ఆళ్ల ఇషాన్

మహా శాంతి యజ్ఞం

ది. 14-04-2025 సోమవారం ఉదయం గం॥ 9.00 లకు వారి ఆత్మ శాంతికై ఆర్య సమాజం, గుంటూరు వారిచే మహాశాంతి యజ్ఞం తలపెట్టినాము. తదుపరి భోజన కార్యక్రమము జరుగును.

కార్యస్థలము : "శ్రీరామధామం"

తనుబుద్ధిబసివిరెడ్డినగర్, రెడ్డిపాలెం, మహాత్మ గాంధి ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు.